
### కొత్త రేషన్‌కార్డులెప్పుడు?

కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ముందు నుంచి ఊరిస్తూనే ఉన్నది. ఏడాది అయినా ఒక్క కొత్త కార్డు ఇవ్వలేదు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని సైతం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ మాటలను నమ్మి వేలాది మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం మాట మార్చింది. కొత్తగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులంటూ తెరపైకి తెచ్చింది. ఈ విషయం కొలిక్కి వచ్చేదెప్పుడు? రేషన్‌కార్డులు జారీ అయ్యేదెన్నడు? అన్నది తేలాల్సి ఉన్నది. మరోవైపు అక్టోబర్ 2 నుంచి రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులంటూ మంత్రులే ప్రకటించారు. అది పెడింగ్‌లోనే ఉంది. ఆహార భద్రత కార్డుల కోసం కరీంనగర్‌లో 12,998, జగిత్యాలలో 9,100, పెద్దపల్లిలో 14,900 రాజన్న సిరిసిల్లలో 12,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 49,498 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొని, కండ్లు కాయలు కాసేలా చూస్తున్నారు.



# మేనిఫెస్టోను మరిచిన కాంగ్రెస్

నాడు హామీల వర్షం..
నేడు అబద్ధాల ప్రచారం

- ఉమ్మడి జిల్లాలో వివిధ పథకాల కింద లక్షల్లో దరఖాస్తులు
- పరిష్కారం ఎప్పుడో స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- అన్నింటిని 'రేపూ మాపూ' అంటూ.. దాటవేత
- ఇంకా 1,39,447 మంది రైతులకు వర్తించని రుణమాఫీ?
- ఇండ్ల కోసం ఉమ్మడి జిల్లాలో 7.18 లక్షల అర్జీలు
- జాడలేని ₹4వేల పింఛన్.. ఊసేలేని నిరుద్యోగ భృతి
- పెండింగ్‌లోనే కొత్త రేషన్ కార్డులు
- నిధులు లేక నీరసించిపోతున్న పల్లెలు
- నేడు వేములవాడకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక
- సీఎం అయినా స్పష్టత ఇస్తారా..? దాటవేస్తారా..?

ఎన్నికల సమయంలో హామీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్, ఇప్పుడా విషయాన్నే మరిచిపోయింది. ప్రస్తుతం ఆ పార్టీ గద్దెనెక్కి ఏడాది కావస్తుండగా, మేనిఫెస్టో అమలును అటకెక్కించింది. అందులో ఒకటి రెండు అమలు చేసినట్టు ఆర్భాటపు, అబద్ధపు ప్రచారాలు చేయడమే తప్ప, ఏ ఒక్క స్కీంను సంపూర్ణంగా అమలు చేసిన దాఖలాలు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ మేనిఫెస్టోను నమ్మి ఓట్లు వేసిన ఉమ్మడి జిల్లా ప్రజలు.. ఆ నాడు ఇచ్చిన హామీలపై నేడు వేములవాడకు వచ్చే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, పంచాయతీల్లో నిధులేమి, నిరుద్యోగ భృతి, కొత్త పింఛన్లు, రైతుల రుణమాఫీ వంటి అనేక అంశాలపై వివరణ ఇవ్వాలని స్పష్టం చేస్తున్నారు.

కరీంనగర్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ పథకం కింద డబుల్‌బెడ్రూం ఇంటిని ₹5లక్షలతో నిర్మించి ఇస్తామని ప్రకటించింది. ఆ మేరకు ఒక్కో శాసనసభా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున మంజూరు చేస్తామని చెప్పింది. ఆ లెక్కన ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 45,500 ఇండ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తుండగా, ప్రస్తుతం ఆ కమిటీ జాబితాలు ఇన్‌చార్జి మంత్రుల వద్ద పెడింగ్‌లో ఉన్నాయి. అవి ఎప్పుడు అధికారికంగా ప్రకటిస్తారో ఇప్పటి వరకు తెలియదు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పుడు మొదలు పెడుతారో స్పష్టత లేదు. కానీ, ప్రభుత్వ మాటల నమ్మి లక్షలాది మంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. తాజా గణాంకాల ప్రకారం ఉమ్మడి జిలాల్లో ఇండ్ల కోసం 7,18,099 దరఖాస్తులు అధికారుల వద్ద ఉన్నాయి. అందులో కరీంనగర్‌లో 2,17,220, జగిత్యాలలో 2,05,412, పెద్దపల్లిలో 1,85,154, రాజన్న సిరిసిల్లలో 1,10,313 అర్జీలు ఉన్నాయి. ముఖ్యమంత్రి ఈ విషయంపై ఏమైనా స్పష్టత ఇస్తారా..? లేదా..? చూడాలన్న ఆశ దరఖాస్తుదారుల్లో నెలకొన్నది.

### పంచాయతీల్లో నిధుల కటకట

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,218 పంచాయతీలు నిధులలేమితో తల్లడిల్లుతున్నాయి. అందులో చాలా వరకు రోజువారీ నిర్వహణ కూడా చేయలేని దుస్థితిలో ఉన్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రగతి కింద తీసుకున్న కార్యక్రమాలన్నీ ప్రస్తుతం ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. తాము అధికారంలోకి వస్తే రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టిన 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం.. మూడంచెల స్థానిక సంస్థలకు నిధులు, విధులు, నిర్వహణ పూర్తిస్థాయిలో అప్పగిస్తామని, గ్రామ పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనం ఇస్తామని, సర్పంచ్ నుంచి జడ్పీటీసీల వరకు వేతన పెంపుపై చర్యలు తీసుకుంటామని మేనిఫెస్టోలో పెట్టిన ఆ పార్టీ, ఇప్పుడు పల్లెలు నిర్వీర్యం అవుతున్నా నిధులు కేటాయించడం లేదు. ఈ పరిస్థితుల్లో నేడు వేములవాడకు వస్తున్న ముఖ్యమంత్రి పంచాయతీలకు ఏమైనా నిధులు కేటాయిస్తారా..? లేదా..? చూడాలి.

### ఏదీ నిరుద్యోగ భృతి?

తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే వరకు ప్రతి నెలా ₹4వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగరహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు సెంట్రలైజ్డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు చేయడంతోపాటు ఉపాధి కల్పనా కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చాలా రకాల ముచ్చట్లు చెప్పారు. ఇప్పటికే కరీంనగర్ ఉపాధి కల్పనా కార్యాలయంలో 18,308 మంది నమోదు చేసుకున్నారు. పెద్దపల్లిలో 20,508 మంది, సిరిసిల్లలో 8వేలు, జగిత్యాలలతో 9వేల మంది నమోదు చేసుకున్నారు. ఇంకా ఉపాధి కల్పన కార్యాలయంలో నమోదు చేసుకోని వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగ భృతి ఇస్తారా..? లేదా అన్న విషయంలో ముఖ్యమంత్రి స్పష్టత ఇస్తారా? లేదా..? చూడాలి.



### నాలుగు వేల పింఛన్ ఏది?

తాము అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న వృద్ధుల పింఛన్‌ను రూ 4వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడా ఊసే ఎత్తడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 10లక్షల మందికిపైగా వివిధరకాల పింఛన్లు పొందుతున్నారు. నిజానికి ప్రభుత్వం రూ. 4వేలకు పెంచితే, అందులో 99 శాతం మందికి లబ్ధి చేకూరుతుంది. కానీ, దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. పోనీ కొత్త అర్జీలనూ పరిశీలించడం లేదు. ఉమ్మడి జిల్లాలో 17,853 మంది కొత్తగా దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. అందులో 8,153 మంది దివ్యాంగులు, 15వేల మంది వయోవృద్ధులు, 1,200 మంది వితంతువులు, 500 మంది ఒంటరి మహిళలు, ఇతరులు 2వేల మంది వరకు ఉన్నారు. ఈ నెలలో కొత్త పెన్షన్ల దరఖాస్తుల ప్రక్రియ మొదలవుతుందంటూ ప్రభుత్వం ప్రకటించినా, ఇంకా ఎలాంటి ఉత్తర్వులు విడుదల చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై స్పష్టత ఇస్తారా..? లేదా..? చూడాలి.

### 1,39,447 మందికి రుణమాఫీ ఏది?

అధికారంలోకి రాగానే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్, ఇప్పుడు ఏడాది గడుస్తున్నా సంపూర్ణ రుణమాఫీ చేయడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,78,678 మంది రైతులు రుణాలు తీసుకున్నట్టు తేల్చిన సర్కారు, ఇప్పటివరకు 2,39,231 మందికి 1,842.89 కోట్లను మాఫీచేసింది. ఇంకా 1,39,447 మందికి రుణమాఫీ చేయాల్సి ఉన్నది. నిజానికి క్షేత్రస్థాయి లెక్కలు అందుకు భిన్నంగా ఉన్నాయి. సుమారు రెండున్నర లక్షల వరకు రుణమాఫీ జరగాల్సి ఉంటుందని తెలుస్తున్నది. తాము అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద ఎకరాకు ₹15వేలు ఇస్తామని చెప్పినా నేటివరకు ఇవ్వడం లేదు. ప్రారంభంలో ఒక సీజన్ మాత్రమే వేసిన సర్కారు, ప్రస్తుతం రెండు సీజన్లలో ఎగనామం పెట్టింది. రైతు భరోసాను పక్కన పెడితే రైతు రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పాలన్న డిమాండ్ వస్తున్నది. దీనిపై ముఖ్యమంత్రి ఎలా స్పందిస్తారో చూడాలి.

### సూరమ్మ రిజర్వాయర్‌కు అరకొరగా నిధులు

జగిత్యాల, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, కథలాపూర్, భీమారం మండలాలతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి మండలాల్లో కలుపుకొని మొత్తం 43,100 ఎకరాలకు సాగునీటిని కల్పించేందుకు ఉద్దేశించింది సూరమ్మ కలికోట రిజర్వాయర్. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుపై ఆధారపడి ఎస్ఐపీ స్టేజ్-2లో భాగంగా దాదాపు ₹400 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఎన్నికల సమయంలో దీనిని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుతోపాటు కుడి, ఎడమ కాలువలు నిర్మించాల్సి ఉన్నది. కాగా, కాలువల నిర్మాణానికి ప్రభుత్వం ₹10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. 520 ఎకరాల భూసేకరణకు ₹వంద కోట్లకు పైగా నిధులు అవసరం ఉండగా, కేవలం ₹10 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఆ నిధులు మంగళవారం ఉదయం వరకు జగిత్యాల కలెక్టర్ ఖాతాలో జమకాకపోవడం గమనార్హం.

### తెరుచుకోని చక్కెర కర్మాగారం

జగిత్యాల, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని దక్కన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. కేవలం ఎన్నికల వాగ్దానంగా మిగిలిపోయింది. అసెంబ్లీ ఎన్నికల వేళ కోరుట్లలో జరిగిన బహిరంగ సభ సాక్షిగా ఫ్యాక్టరీని తెరిపిస్తామని అప్పటి టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ కోరుట్ల బహిరంగ సభలో మరోసారి స్పష్టం చేశారు. అయితే, దీనిపై ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ మొదలు పెట్టలేదు. బోధన్, ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే విషయంలో లోక్‌సభ ఎన్నికల సమయంలో కొంత హంగామా చేసింది. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చైర్మన్‌గా కమిటీ వేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, తదితరులు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఎన్నికల సమయంలో ఒక్కసారి ముత్యంపేటలో సమావేశం నిర్వహించి తదుపరి ముఖం చాటేశారు.



# పరిశ్రమ సిరిసిల్లలో.. యార్న్ డిపో వేములవాడలో నట!

- సర్కారు అనాలోచిత నిర్ణయంపై ఆసాములు, యజమానుల్లో అసంతృప్తి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): కార్మిక క్షేత్రం సిరిసిల్లలో నూలు డిపో పెట్టాలనే డిమాండ్ ఏళ్లుగా ఉన్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంపై ఆసాములు, యజమానుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. వేములవాడలో గుడి ఉంటే సిరిసిల్లలో హుండీలు పెట్టినట్లు.. దాదాపు పరిశ్రమ అంతా సిరిసిల్లలో ఉంటే.. వేములవాడలో యారన్ డిపో ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తున్నది. నిజానికి రాష్ట్రంలోనే అతి పెద్ద మరమగ్గాలు సిరిసిల్లలోనే ఉన్నాయి. అన్నీ కలిపి దాదాపు 30వేలకుపైనే ఉన్నాయి. సిరిసిల్ల పట్టణంలో నూలు అవసరం చాలా ఉంటుంది. వేములవాడ చుట్టుపక్కల రెండువేలకు మించి మగ్గాలు లేవు. ఆసాములు, యజమానులకు అవసరం పడే నూలు 12 కిలోమీటర్ల దూరం వెళ్లి తీసుకురావాలంటే రవాణా చార్జీలు భారం కానున్నాయి. చిన్న చిన్న ఆసాములు తక్కువ సంఖ్యలో కొనుగోలు చేసుకుంటారు. అలాంటి వారికి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. పెద్దూరులోని అప్పారెల్ పార్క్, లేదా టెక్స్‌టైల్స్ పార్కులోని గోదాముల్లో ఏర్పాటు చేస్తే తమ ఇబ్బందులు తీరుతాయని చెబుతున్నారు. సాంచాల సప్పుళ్లే లేని ధార్మిక క్షేత్రంలో యారన్ బ్యాంకు పెట్టడం వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుందని ప్రశ్నిస్తున్నారు.

### పరిశ్రమ ఉన్న చోటే పెట్టాలి



సిరిసిల్లలో దాదాపు 30వేల మరమగ్గాలున్నయ్. నూలు బ్యాంకు కావాలని కొన్నేళ్లుగా అడుగుతున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. కానీ మాకు అనుకూలంగా లేకపోవడం బాధాకరం. మాకు రోజు నూలు అవసరమే ఉంటుంది. పెట్టుబడి లేని మేము ఎంతో కొంత తెచ్చుకునేందుకు వేములవాడ వెళ్లాలంటే అసౌకర్యంగా ఉంటుంది. రాను పోను 25కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పైగా అక్కడ సాంచాలు లేవు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

**- శ్రీపతి రాజు, మరమగ్గాల ఆసామి, మ్యాక్స్ సొసైటీ సభ్యుడు**



సిద్ధమైన సభా ప్రాంగణం

# నేడు వేములవాడకు ముఖ్యమంత్రి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమీక్ష

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వేములవాడలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. కాగా, సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో రెవెన్యూ, పోలీస్, సీఎం సెక్యూరిటీ సిబ్బంది ఇతర శాఖల అధికారులకు దిశానిర్దేశం చేసి వివరాలను వెల్లడించారు. బుధవారం వేములవాడ పట్టణంలో సీఎం పర్యటిస్తారని, అనంతరం రాజన్నను దర్శించుకుని పూజలు చేస్తారని చెప్పారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని, ఆ తర్వాత బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. అక్కడి నుంచి అతిథి గృహానికి వెళ్లి, భోజనం చేసి తిరిగి హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారన్నారు. పర్యటన విధులు నిర్వర్తించే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రినీరెడ్డి, సీఎంవో సెక్యూరిటీ సిబ్బంది, ఆర్డీవో రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం పర్యటన షెడ్యూల్

- ఉదయం 9.45 గంటలకు హెలికాప్టర్‌లో వేములవాడలోని గుడిచెరువు గ్రౌండ్‌కు చేరుకుంటారు
- 9.55 గంటలకు దేవస్థానం అతిథిగృహానికి వెళ్తారు
- 10.10 నుంచి 11.45 గంటల వరకు రాజన్నను దర్శించుకొని, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు
- 11.55 గంటలకు ఎస్సారార్ అతిథి గృహానికి వెళ్తారు
- 12.30 నుంచి 1.40వరకు గుడి చెరువు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతారు
- 1.45 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరిగి వెళ్తారు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


# ఏం చేశారని విజయోత్సవ సభలు?

- రేవంత్‌రెడ్డిది ఫెల్యూర్ ప్రభుత్వం
- దమ్ముంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 19 : అనేక హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా ఫెల్యూర్ అయిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. ఏడాదిలో ఏం చేశారని విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. కరీంనగర్‌లోని 37వ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి చేశారని, అందుకే ప్రజలు విజయోత్సవాలు చేశారని గుర్తు చేశారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిలో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, దమ్ముంటే ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని దుయ్యబట్టారు. ఫార్మా పేరుతో రైతులపై అక్రమ కేసులు పెడుతున్నందుకు విజయోత్సవాలు చేస్తున్నారా..? రైతు రుణమాఫీ ఎగ్గొట్టినందుకా..? పింఛన్లు పెంచుతామని చెప్పి తప్పినందుకా..? యువతకు స్కూటీలు ఇస్తామని చెప్పి ఇవ్వనందుకా..? తులం బంగారం ఇస్తామని చెప్పి మర్చిపోయినందుకా..? 20 ఏండ్ల కిందట నిర్మించుకున్న ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్నందుకా..? లగచర్లల్లో ప్రజలను అవస్థలు పెడుతున్నందుకా..? ఎందుకు విజయోత్సవ సభలు చేస్తున్నారని నిలదీశారు. యువతను నమ్మించి ఎన్నికల సమయంలో అనేక విధాలుగా ప్రచారం చేయించుకున్నారని, ఇప్పుడు నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ సర్కారు ఏమీ చేయలేదని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# సీఎం సభకు బస్సులు.. ప్రయాణికుల అవస్థలు

- కిక్కిరిసిపోయిన బస్టాండ్లు
- వేములవాడలో ఆందోళన
- ముఖ్యమంత్రిపై ఆగ్రహం



వేములవాడల బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

కరీంనగర్ తెలంగాణచౌక్/ వేములవాడ రూరల్, నవంబర్ 19 : వరంగల్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల నుంచి 156 పల్లెవెలుగు బస్సులు కేటాయించడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి సమాఖ్య మహిళలను తరలించడం కోసం సంబంధిత శాఖ డీఆర్‌డీఏ విజ్ఞప్తి మేరకు వీటిని సభకు కేటాయించారు. దీంతో ఆయా బస్టాండ్లలో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో బస్సులు లేక ఆరు గంటలపాటు బస్టాండ్‌లో వేచి చూశారు. కార్తీక మాసం కావడం, బద్ది పోచమ్మకు బోనాలు సమర్పించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. కానీ, ఆర్టీసీ అధికారులు ముందస్తుగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. కనీసం ప్రయాణికులకు బస్సులు ఎప్పుడు వస్తాయో చెప్పలేకపోయారు. గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై ఆందోళన వ్యక్తం చేశారు. తిప్పాపూర్ బ్రిడ్జిపై వాహనాలు నిలిచిపోయి దాదాపు గంట పాటు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు చెల్లాచెదురు చేయడడంతో ప్రయాణికులు ఎదురుతిరిగారు. ఓటు వేసి గెలిపిస్తే రేవంత్‌రెడ్డి తమకు బస్సులు లేకుండా చేసి ఇబ్బంది చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం మీటింగ్‌లకు బస్సులను వాడుకొని ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు.

### కరీంనగర్‌లోనూ ఇబ్బందులు

ఇటు కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్, మంచిర్యాల, గోదావరిఖని, ధర్మపురి, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, బెజ్జంకి, సిద్దిపేట, సిరిసిల్ల రూట్లలోని గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీంతో కొందరు తమ గ్రామాల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలని డ్రైవర్లను బతిమిలాడుకొని ఆ బస్సుల్లో వెళ్లారు. ఎక్స్‌ప్రెస్ వెళ్లని రూట్లలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. సీఎం సభకు బస్సులను కేటాయించే సమాచారాన్ని ఆర్టీసీ అధికారులు ఒక రోజు ముందు సమాచారం తెలిపితే తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవడం, లేదా మరో మార్గం ద్వారా గమ్యస్థానాలకు చేరుకునేవారమని ప్రయాణికులు వాపోయారు.



కరీంనగర్: బస్సులో సీట్ల కోసం పోటీ పడుతున్న ప్రయాణికులు

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిద్ధం వేణు



ఇల్లంతకుంట, నవంబర్ 19 : ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం హాలిడేను ప్రకటించడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు సిద్ధం వేణు విమర్శించారు. సభకు ఎటువంటి సంబంధం లేకపోయినా సెలవు ప్రకటించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం సభను దృష్టిలో పెట్టుకొని జిల్లా విద్యాశాఖ అధికారికంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించిందని, ఇటువంటి విధానాలు మానుకోవాలని సూచించారు. స్కూల్ బస్సుల తరలింపు కోసమే సెలవు ప్రకటించారని విమర్శించారు. గతంలో ఎన్నోసార్లు ముఖ్యమంత్రుల సభలు సమావేశాలు జరిగాయని, కానీ, ఎప్పుడు కూడా ఇలా సెలవులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా సరే ముఖ్యమంత్రి మీటింగ్ పెడితే పాఠశాలలకు సెలవు ఇవ్వడం సముచితం కాదని.. ముఖ్యమంత్రి ఈ విషయంలో ఆలోచన చేసి అధికారులకు తగు సూచనలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.




కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

# పెన్షనర్ల హామీలు నెరవేర్చాలి

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 19 : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పెన్షనర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కరీంనగర్ జిల్లా పెన్షనర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొలువుదీరి పదకొండు నెలలు గడిచినా తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్షుడు చంచుపట్ల జనార్దన్ మాట్లాడారు. తమ సమస్యలపై సీఎం రేవంత్‌కు పలుసార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే నాలుగు డీఏలు విడుదల చేయాలని, ఈకుబేర్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం కింద అన్ని కార్పొరేట్ దవాఖానల్లో ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.